రామగుండం అభివృద్ధికి ప్రణాళిక

• మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కోల్‌సిటీ: రామగుండం నగరాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దడానికి కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గోదావరిఖనిలోని లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, మేదరి బస్తీ, ఉల్లిగడ్డల బజార్ తదితర ప్రాంతాల్లో టీయూ ఎఫ్‌ఐడీసీ నిధులు రూ.29.5 కోట్లతో రోడ్లు, భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ, వీధిదీపాలు ఏర్పాటు చేసే అభివృద్ధి పనులకు బుధవారం సాయంత్రం గోదావరిఖని కళ్యాణ్ నగర చౌరస్తాలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే ఎస్.ఎస్.రాజ్‌ఠాకూర్, మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్య వ్యాపార కూడలి లక్ష్మీనగర్ వ్యాపారస్తులకు భద్రత, భరోసా కల్పించడంలో స్థానిక ఎమ్మెల్యేకు సహకరిస్తున్నామన్నారు. ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు ప్రజలు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా అభివృద్ధి పనులను నిర్వహించాలని సూచించారు. సింగపూర్‌కు చెందిన ఒక ప్రయివేటు సంస్థ సహకారంతో స్థానికంగా రూరల్ టెక్నాలజీ



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

సెంటర్ నెలకొల్పనున్నట్లు తెలిపారు. రామగుండంలోని పాత 63 మెగావాట్ల పవర్ ప్లాంట్ స్థానంలో కొత్తగా 800 మెగావాట్ల సామర్థ్యంతో పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.100 కోట్లు మంజూరు కాగా సుమారు రూ.36 కోట్లు నాలుగు డివిజన్లలో విస్తరించి ఉన్న ముఖ్య వ్యాపార కూడళ్ల అభివృద్ధికే ఖర్చు చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లాను స్మార్ట్ జిల్లాగా తీర్చిదిద్దడానికి మంత్రి కృషి చేస్తున్నారని, రామగుండం నగరానికి పూర్వ వైభవం తీసుకువచ్చే క్రమంలో రూ 2.5కోట్లతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు, 800 మెగావాట్ల పవర్ ప్లాంట్, రూ.100 కోట్లతో సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్, క్రీడా మైదానాలు, శ్మశాన వాటికల అభివృద్ధి తదితర పనులు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ సెక్రెటరీ రాజు, ఈఈ రామన్, డీఈఈ జమీల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రామగిరి: నాగెపల్లికి చెందిన మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య తల్లి తీగల మల్లమ్మ, మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ బొగె లింగయ్య ఇటీవల మృతి చెందారు. కాగా బుధవారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ వారి కుటుంబాలను పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, మండల అధ్యక్షుడు రోడ్డ బాపు, నాయకులు ఎల్లె రామ్మూర్తి, కండె పోచం, బర్ల శ్రీనివాస్, ఎరుకల బాబురావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సింగిల్‌విండో మాజీ చైర్మన్‌కు పరామర్శ



పరామర్శిస్తున్న లక్ష్మణ్‌కుమార్, జీవన్‌రెడ్డి

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లికి చెందిన సింగిల్‌విండో మాజీ చైర్మన్ పుస్కూరి నర్సింగరావు సతీమణి భారతి అనారోగ్యంతో బుధవారం మరణించారు. కాగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నర్సింగరావు కుటుంబాన్ని పరామర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, శైలేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, ఎదుల్ల అంజయ్య పాల్గొన్నారు.

అదనపు డీసీపీకి సన్మానం



సన్మానిస్తున్న కాంగ్రెస్ ప్రతినిధులు

రామగుండం: అంతర్గాం మండల కాంగ్రెస్ ప్రతినిధులు అదనపు డీసీపీ (అడ్మిన్) సి.రాజును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, గంగారపు వెంకటేశ్, దుర్గాప్రసాద్, మగ్గిడి సాగర్, సదానందం ఉన్నారు.

పేదింటి పెళ్లికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న స్వర్ణకారులు

గోదావరిఖనిటౌన్: స్థానిక ఎల్‌బీనగర్ నివాసి అయిన పేద కుటుంబానికి చెందిన స్వర్ణకారుడు సిరికొండ వెంకటేశ్వర్లు కూతురు వివాహానికి స్వర్ణకారుల సంఘం నాయకులు రూ.54,230 బుధవారం అందజేశారు. వివాహానికి అవసరమైన పుస్తెమట్టెలు, చీర, 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, కార్పొరేషన్ అధ్యక్షుడు కొండపర్తి నరహరి, ప్రధాన కార్యదర్శి కట్ట నగేష్, కట్ట శ్రీధరాచారి, శ్రీరామోజు జగన్, గాలిపెల్లి రమేశ్, కందుకూరి రాజు, దేవరకొండ శ్రీను, సాగర్ పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు



సన్మానిస్తున్న ఎరువుల షాపు నిర్వాహకులు

కమాన్‌పూర్: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే ఎరువు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఏవో రామకృష్ణ అన్నారు. విధుల్లో చేరిన ఏవోను బుధవారం మండలంలోని ఎరువుల షాపు నిర్వాహకులు కలిశారు. ఏవో మాట్లాడుతూ షాపుల్లో స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. అనంతరం ఏవోను సన్మానించారు. కార్యక్రమంలో కోలేటి రామన్న, కాశెట్టి శ్యాం, ఆకుల సదయ్య, పాదం శ్రీనివాస్, కోలేటి అనుష్, హరీశ్, మహేశ్, శంకర్ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

సుల్తానాబాద్: కోల్‌కతా ట్రైనీ వైద్యురాలిని అత్యాచారం చేసి, హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు కోరారు. బుధవారం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

నిందితులను ఉరితీయాలి

సుల్తానాబాద్: కోల్‌తాలో ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం, హత్యచేసిన నిందితులను వెంటనే ఉరితీయాలని ముస్లిం యువకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని దర్గా నుంచి పోలీస్‌స్టేషన్, బస్టాండ్, పూసాల రోడ్డు మీదగా శ్రీరాంపూర్ క్రాస్ రోడ్ వరకు బుధవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సుల్తానాబాద్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శోభా శంకర్ సూచించారు. పట్టణంలోని శాస్త్రినగర్‌లో మున్సిపల్ కార్మికులు చేపట్టిన పారిశుధ్య పనులను బుధవారం ఆమె పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలో మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి నిత్యం బ్లీచింగ్ చేయడంతో పాటు క్లోరినేషన్ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. నీటి నిల్వ ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందితో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్, సిబ్బంది నాగరాజు, రాజ్‌కుమార్ ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శోభాశంకర్

బదిలీ అధికారికి సన్మానం



సన్మానిస్తున్న ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు

రామగిరి: ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాపు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.వెంకట్రాంరెడ్డి శ్రీరాంపూర్ ఏరియాలోని ఏరియా వర్క్‌షాపునకు బదిలీ అయ్యారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు, అధికారులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, అధికారులు ఎర్రన్న, టి.రఘురాం, పి.డి.సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం అప్పగింత

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి గ్రామశివారులో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఎకరం ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ బుధవారం సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు స్థానిక తహసీల్దార్ రజిత సర్టిఫికెట్ అందించారు. రెండేళ్ల క్రితం మండలంలోని బంజేరుపల్లి పంచాయతీ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రభుత్వం మంజూరీ చేసింది. అయితే అనివార్య కారణాలతో స్థలం ఎంపిక చేయలేకపోయారు. దీంతో కటికెనపల్లికి చెందిన యువకుడు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి దృష్టికి తీసుకవెళ్లగా కటికనపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెండేళ్ల తర్వాత కటికెనపల్లి గ్రామశివారులో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఎకరం భూమి కేటాయిస్తూ విద్యుత్ అధికారులకు తహసీల్దార్ సర్టిఫికెట్ అందించడంతో సబ్‌స్టేషన్ నిర్మాణానికి మోక్షం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరలక్ష్మి, మాజీ ఉపసర్పంచు రామడుగు గంగారెడ్డి, నాయకులు చేపూరి లచ్చయ్య, ఈదుల రాజేశ్వర్‌రెడ్డి, ఈదుల జయాకర్‌రెడ్డి ఉన్నారు.



ఏఈకి సర్టిఫికెట్ అందిస్తున్న తహసీల్దార్ రజిత

సింగరేణిలో అన్ని యూనియన్లతో చర్చించాలి

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు యూనియన్ గెలిచి పత్రం తీసుకోకపోవడంతో గుర్తింపు రద్దు చేసి అన్ని యూనియన్లతో సమస్యలపై చర్చించాలని సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్ కోరారు. ఆర్జీ–1 ఏరియాలోని అన్ని గనులపై బుధవారం పోస్టర్ ఆవిష్కరించి సంతకాల సేకరణ చేపట్టారు. కార్మికుల సమస్యలపై తమ యూనియన్ పోరాటానికి సిద్ధమైందని, ఆగస్టు 20 నుంచి సింగరేణివ్యాప్తంగా కార్మికుల సంతకాల సేకరణ చేసి 26న గనులు, డిపార్ట్‌మెంట్లపై మేనేజర్లకు వినతిపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. నాయకులు ఆరెపల్లి రాజమౌళి, గజేంద్ర, శ్రీనివాసరావు, వంగల రాములు, ఎ.శంకరయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

సుల్తానాబాద్: మండల కేంద్రంలో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఎంపీపీ బాలాజీరావు, మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీలో విఫలమైనందని ఆరోపించారు. అందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ చేసే ధర్నాకు పట్టణం, మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు గ్రామ అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

అర్హులందరికీ గృహజ్యోతి వర్తింపజేయాలి

కోల్‌సిటీ: అర్హులందరికీ గృహజ్యోతి ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఈఈ రామన్‌కు వినతిపత్రం అందజేశారు. గృహజ్యోతి పథకం కింద తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న వారిలో సగం మందికి కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి లబ్ధిదారులకు పథకం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాతంగి రేణుక, మామిడి రాజేశ్, కొమ్మ శ్రీనివాస్, మామిడి సంపత్, అడ్డూరి రాజేశ్, కుమ్మరి మల్లేశ్, సల్ల వేణురెడ్డి, వడ్డేపల్లి సదానందం, దుబ్బాసి లక్ష్మణ్, బొల్ల మోహన్, వెంకటేశ్వరరావు, ఉప్పరి మల్లమ్మ, స్వరూప, లక్ష్మి, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సంక్షిప్త వార్తలు

● **నేడు జిల్లాస్థాయి యోగా ఎంపిక పోటీలు**

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో గురువారం జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్టు యోగా అసోసియేషన్ జిల్లా సెక్రటరీ అయిల విజయ్‌కుమార్ తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం(వరిజనల్, జిరాక్స్)తో ఉదయం 9.30గంటలకు హాజరు కావాలని తెలిపారు.

● **అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత**

ఓదెల: మండలంలోని కనగర్తి, కందులపల్లి గ్రామాల పరిధిలోని మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ యాకన్న బుధవారం తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన పలు ట్రాక్టర్లపై పొత్కపల్లి పోలీసులు కేసు నమోదు చేశారని, ఇసుకను తహసీల్ కార్యాలయానికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

● **ఆమె నేత్రాలు సజీవం**

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ ఎన్‌సీ–33లో నివాసం ఉంటున్న ఓసీపీ–1 అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ తల్లి వగ్గం నాగమ్మ కిడ్నీ సంబంధిత సమస్యలతో మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆధ్వర్యంలో టెక్నీషియన్ నరేందర్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంకుకు తరలించారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ రాధాకృష్ణ, మేనేజర్ హరిజన్, సంక్షేమ అధికారి సాయికృష్ణ, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు కుటంబ సభ్యులను అభినందించారు.

● **విద్యార్థులకు అవగాహన సదస్సు**

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆర్.స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో 100కి డయల్ చేసి సాయం పొందాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

● **సైబర్ నేరాలపై అవగాహన సదస్సు**

రామగిరి: మహిళల భద్రత, సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్‌పై బుధవారం రామగిరి కస్తూర్బా బాలికల పాఠశాలలో షీ టీం సభ్యురాలు స్నేహలత విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే 63039 23700 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. పాఠశాల ప్రత్యేకాధికారి మంజుశ్రీ, షీ టీం సిబ్బంది సురేశ్ పాల్గొన్నారు.

● **కమాన్‌పూర్ ఎంపీడీవోగా లలిత**

కమాన్‌పూర్: కమాన్‌పూర్ ఎంపీడీవోగా జె.లలిత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సురేశ్‌ను ముత్తారానికి బదిలీ చేశారు. కాగా అక్కడ విధులు నిర్వహిస్తున్న లలితను కమాన్‌పూర్‌కు బదిలీ చేయగా విధుల్లో చేరారు.

● **ముత్తారం ఎంపీడీవోగా సురేశ్**

ముత్తారం: ముత్తారం ఎంపీడీవో ఎం.సురేశ్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు పనిచేసిన ఎంపీడీవో లలిత కమాన్‌పూర్‌కు బదిలీ కాగా అక్కడి ఎంపీడీవో సురేశ్ ముత్తారానికి వచ్చారు.

● **విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి**

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వెన్నంపల్లిలో బుధవారం బండి రమేశ్‌కు చెందిన ఎద్దు విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పత్తిపంటలో గుంటుకు కొడుతుండగా సపోర్ట్ వైర్‌కు ఎద్దుతోక తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు రమేశ్ పేర్కొన్నాడు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.60వేలు ఉంటుందన్నారు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని, సపోర్ట్ వైర్‌కు ఇన్సులేటర్ అమర్చకపోవడమే ప్రమాదానికి కారణమైందని గ్రామస్తులు ఆరోపించారు.

● **ఆర్‌ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి**

గోదావరిఖని: ఆర్‌ఎఫ్‌సీఎల్ కంపెనీలో పనిచేసే బ్యాగర్స్, స్టిచ్చర్స్ కార్మికులకు న్యాయం చేయాలని నాయకులు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌ను కోరారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో బుధవారం ఐఎఫ్‌టీయూ నాయకులు చిలుక శంకర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. నాయకులు తిప్పని రాంకీ, కొండ్ర రూపేష్, ఆవుల రాకేశ్, ముచ్చర్ల సతీశ్, మానుక మధూకర్, మారం తిరుపతి పాల్గొన్నారు.

● **అపోహలు వీడండి.. నేత్రదానం చేయండి**

కోల్‌సిటీ: అపోహలు వీడి మరణానంతరం నేత్ర, అవయవ, దేహదానం చేయడానికి ముందుకు రావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గోదావరిఖని జీఎం కాలనీకి చెందిన మల్లుబాయ్ అలియాస్ శకుంతల(61) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆమె నేత్రాలను దానం చేశారు. బుధవారం గంగానగర్‌లో సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి సి.హెచ్.లింగమూర్తి, ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు వంశీ, శ్యామ్‌సుందర్, దయానంద్ గాంధీ మాట్లాడారు. అనంతరం నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం అందజేశారు. రఘుపతిగౌడ్, కుమార్, శంకర్ పాల్గొన్నారు.

● **పాఠశాల క్రీడలు ప్రారంభం**

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్లో బుధవారం స్కూల్ గేమ్స్‌ను ఎంఎస్‌వో మహేశ్ ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు, పీఈటీలు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

● **కల్వచర్ల ప్రభుత్వ స్కూల్లో కిచెన్ గార్డెన్**

రామగిరి: కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించే ఉద్దేశంలో భాగంగా జీవశాస్త్రం ఉపాధ్యాయుడు గసిగంటి దేవేందర్ ప్రత్యేక చొరవతో పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులను టీంలుగా ఏర్పాటు చేసి కూరగాయల విత్తనాలు సేకరించి ఖాళీ సమయాల్లో సేంద్రియ పద్ధతిలో సాగు చేయించారు.

● **నిత్యావసరాలు అందజేత**

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని బందారికుంటలో గల స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు బుధవారం గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నిత్యావసరాలు అందించారు.



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో శిథిలావస్థకు చేరిన భవనం ప్రమాదకరంగా మారింది. పాఠశాల ప్రధాన గేటుకు ఎదురుగా ఉండడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఆ భవనం ఎదుట నుంచే తరగతి గదులకు వెళ్తుంటారు. పూర్తిగా శిథిలావస్థలో ఉన్న భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఉన్నత అధికారులు శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
- విజయ్, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం, సెల్ : 77807 60835

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94403 81258

పచ్చదనం పెంచేందుకే వన మహోత్సవం

రామగిరి: పచ్చదనం పెంచేందుకే సింగరేణి సంస్థలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. ఏపీఏ ఏరియాలో బుధవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులు, కార్మికులు, సిబ్బందితో కలిసి సుమారు 100 మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ మొక్కలు పెంచాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు నాటి సింగరేణి నల్ల నేలను హరితవనాలుగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. మొక్కల అవశ్యకతను తెలియజేస్తూ పరిసర గ్రామాల ప్రజలకు మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు, ప్రాజెక్టు ఇంజనీర్ రఘురాం, ఎస్‌వోఎం జనార్దన్, వెల్ఫేర్ ఆఫీసర్ రవిచంద్ర పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

గనిలో భద్రతపై అవగాహన ఉండాలి

రామగిరి: గనిలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, పిట్ సేఫ్టీ కమిటీ సభ్యుల పాత్ర కీలకమని, గనిలో భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. సెంటనరీకాలనీ ఎంవీటీసీ నందు ఏపీఏ వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, పిట్ సేఫ్టీ కమిటీ సభ్యులకు పది రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను జీఎం బుధవారం ప్రారంభించారు. ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, మేనేజర్ మల్లన్న, ఎస్ఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పైరవీలకు పరిమితమైన గుర్తింపు సంఘం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో గెలుపొందిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా పైరవీలకు మాత్రమే పరిమితమైందని సీఐటీయూ యూనియన్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ముత్యంరావు ఆరోపించారు. ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 సీహెచ్‌పీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు జరిగి తొమ్మిది నెలలు కావస్తున్నా గుర్తింపు పత్రం పొందకుండా సింగరేణిలో నిర్వహిస్తున్న అన్ని సమావేశాలకు హాజరుకావడాన్ని ఎలా చూడాలి అని ప్రశ్నించారు. బొగ్గుగనుల వేలం విషయంలో గెలిచిన ప్రాతినిధ్య సంఘాల వైఖరి కార్మికులకు అర్థం కాకుండా వ్యవహరించాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీల విషయంలో గుర్తింపు సంఘం ప్రభుత్వంతో చర్చించకుండా కార్మికులను మోసం చేస్తోందని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఐటీయూ ఎల్లప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలు నేరవేర్చేదిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ప్రవీణ్‌కుమార్, వెంకన్న, శ్రావణ్, కిషోర్, శివ, సంతోష్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

గోదావరిఖని: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రుణమాఫీ చేయకుండా నట్టేట ముంచిందన్నారు. 40శాతం మందికే రుణమాఫీ చేసి రైతుల గుండెల్లో గునపాలు దింపిందన్నారు. కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. సర్కారు తీరును నిరసిస్తూ నియోజకవర్గం, మండల కేంద్రాల్లో గురువారం ధర్నాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఆముల నారాయణ, కల్వచర్ల కృష్ణవేణి, గాధం విజయ పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం..

తెలంగాణ తొలిసీఎం కేసీఆర్ పాలనలో మంజూరైన అభివృద్ధి పనులు ప్రారంభం సందర్భంగా కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ క్షీరాభిషేకం చేశారు. రూ.100 కోట్లతో కార్పొరేషన్ అభివృద్ధి కోసం ఆనాడే ప్రత్యేకంగా అనుమతి మంజూరు చేయించామని తెలిపారు. తొలిదశలో రూ.50 కోట్లకు టెండర్ ప్రాసెస్ జరిగిందని, రూ.50కోట్ల మంజూరు కోసం జీవో అమలైనా ఎన్నికల కోడ్ రావడంతో పనులు అర్థంతరంగా ఆగిపోయాని తెలిపారు. తాము తెప్పించిన నిధులతో బుధవారం అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో గులాబీ జెండాకు ప్రజలు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు అచ్చె వేణు, చల్లగురుల మొగిలి, పిల్లి రమేశ్, నారాయణదాసు మారుతి, చెలకలపల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి, జక్కుల తిరుపతి, నీరటి శ్రీనివాస్, కొటం బాబు, జిట్టవేని ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న కోరుకంటి చందర్

మాల మహానాడు నిరసన

గోదావరిఖనిటౌన్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపు మేరకు భారత్ బంద్‌లో భాగంగా జాతీయ మాల మహానాడు నాయకులు బుధవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తు నిరసన తెలిపారు. జాతీయ మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు మాలెం మధు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. నాయకులు ఎరుకల లక్ష్మణ్‌రావు, పిట్టల వెంకటేశ్, నంది నాగేశ్వరరావు, ఎరుకల లింగమూర్తి, నూకల మొండయ్య, దాసరి రామస్వామి, రమేశ్, కృష్ణయ్య, దిగుట్ల మల్లయ్య, ఎరుకల రాజకిషోర్, దీపక్, సుధీర్, ఎరుకల నాగరాజు, బహుజన సమాజ్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు అలవాడు పడొద్దు

ముత్తారం: విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని హెడ్ కానిస్టేబుల్ మధునయ్య సూచించారు. ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.